క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



బాధితునికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: పేదలపై వైద్యభారం పడకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారం అందిస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఇద్దరు రోగులకు సంబంధించి రూ.1.22లక్షలకు బుధవారం సాయంత్రం చెక్కులను అందజేశారు. ఏబీవీవీ సత్యనారాయణ అనే వ్యక్తికి రూ.లక్ష, పచ్చిగోళ్ల లలిత అనే యువతికి రూ.22 వేల వంతున పరిహారం చెక్కులను అందించారు. కార్యక్రమంలో గంద్రెడ్డి రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అయ్యప్ప సేవా సంఘం ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ స్వామి అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. పాలమరశెట్టి బూలిరాజు కుమారుడు బాలకృష్ణ జ్ఞాపకార్థం చలివేంద్రానికి రెండు రోజుల పాటు విరాళాన్ని అందజేశారు. వేసవి పూర్తి కాలం మజ్జిగ చలివేంద్రాన్ని కొనసాగించనున్నట్లు సేవా సంఘం అధ్యక్షుడు, గురుస్వామి అదపాక వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు భూరాడ అప్పలనాయుడు, ఆళ్ల నాని, సీహెచ్. మురళీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రీపెయిడ్ ఆటోస్టాండ్ ఏర్పాటుకు విజ్ఞప్తి

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రీపెయిడ్ ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలని నగర పోలీస్ కమిషనర్, డీఆర్‌ఎంలకు దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ట్విట్టర్‌లో విజ్ఞప్తి చేసింది. ప్రీ పెయిడ్ ఆటోస్టాండ్ లేకపోవడం వల్ల ఆటో డ్రైవర్లు ఇష్టారాజ్యంగా చార్జీలు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. పోలీస్, రైల్వే అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రీ పెయిడ్ ఆటోస్టాండ్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.


విద్యార్థులకు కాపీ రైటింగ్‌లో పోటీ



కాపీ రైటింగ్ పోటీలో పాల్గొన్న చిన్నారులు

గాజువాక : గాజువాక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు కాపీ రైటింగ్ పోటీలు నిర్వహించారు. అంతకు ముందు పదాలను విడదీసి చక్కగా రాయడంపై శిక్షణనిచ్చారు. కథలు చెప్పడం, చెప్పిన కథను రాయడం, చదవడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. గ్రంథాలయాధికారి బి.చంద్రకళ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పెదగంట్యాడ గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అటు ఆక్రమణలు.. ఇటు తుప్పలు



ఇళ్ల ముందుకు వచ్చిన తేలు

- అధ్వానంగా గెడ్డ
- తిష్ట వేస్తున్న పందులు
- ఇళ్ల ముందు సంచరిస్తున్న విషపురుగులు
- భయాందోళనలో స్థానికులు



ఆక్రమణల కారణంగా కుచించుకుపోయిన గెడ్డ



గెడ్డలో ఏపుగా పెరిగిన మొక్కలు

పెదగంట్యాడ: మొక్కలు కమ్మేశాయి.. గెడ్డను కప్పేశాయి. ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల కారణంగా విషపురుగులు చేరడంతో స్థానికులు హడలిపోతున్నారు. గెడ్డల్లో పూడిక తొలగించకపోవడంతో పందులు తిష్ట వేస్తుండడంతో ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ 65వ వార్డు వికాస్‌నగర్ గోడకు ఆనుకొని, 64వ వార్డు పరిధిలోని కొత్త దిబ్బపాలెం మీదుగా ఇక్కడ ఒక పెద్ద గెడ్డ ఉంది. విశాలమైన ఈ గెడ్డ ఆక్రమణల కారణంగా కుచించుకుపోయింది. పారిశుధ్య నిర్వహణ లోపం కారణంగా చెత్తాచెదారంతో నిండిపోయింది. ఈ గెడ్డలో సుమారు అర కిలో మీటరు వరకూ పిచ్చి మొక్కలు గుబురుగా పెరిగిపోవడంతో పందులు అందులోనే ఆవాసాలను ఏర్పరుచుకున్నాయి. ఇటీవల అందులో ఉన్న కొన్ని పందులు మృత్యువాత పడడంతో భరించలేనంత దుర్వాసన వెదజల్లింది. దీని కారణంగా వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉండడంతో స్థానికులు ఆందోళన చెందారు. ఇక్కడి చెత్తాచెదారాన్ని తొలగించకుండా వదిలేయడంతో వర్షాలు పడినపుడు గెడ్డ నుంచి వర్షపునీటి ప్రవాహం తీవ్రంగా వస్తోంది. దీంతో గెడ్డ అంచులు కోతకు గురవుతున్నాయి. ఫలితంగా గెడ్డ పక్కన ఉన్న కొబ్బరి చెట్లు, ఇతర చెట్లు కూకటివేళ్లతో సహా పడిపోతున్నాయి. ఆ సమయంలో ఏ చెటు ఎవరిపై పడుతుందోనని స్థానికులు భయాందోళనకు లోనవుతున్నారు. అంతేకాకుండా గెడ్డ ఒక్కసారిగా పొంగిపోవడంతో వరద నీరంతా ఇళ్లలోకి వస్తోందని చెబుతున్నారు.

చీకటి పడితే చాలు..

రోజూ చీకటి పడితే చాలు స్థానికులకు కంటిపై కునుకు ఉండడం లేదు. గెడ్డలో తిష్ట వేసిన పాములు, తేళ్లు, జెర్రులు తదితర విషపురుగులు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయి. దీంతో బయటకు రావాలంటేనే భయపడాల్సిన దుస్థితి నెలకొని ఉంది. ఒక్కోసారి పెద్ద పాములు కూడా సంచరిస్తున్నాయని చెబుతున్నారు. దీనిపై పలుమార్లు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేశామని, అయినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గెడ్డలో పూడిక తీయించి, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయాలని కోరుతున్నారు.

నరకం చూస్తున్నాం



గెడ్డ నిర్వహణ లోపం కారణంగా నరకం చూస్తున్నాం. వర్షం పడితే బయటకు రాలేకపోతున్నాం. గెడ్డ పొంగి వరద నీరు ఇళ్లలోకి వస్తోంది. ఆ నీటిలో నుంచి విష పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయి.

– ఇ.రాము, కొత్త దిబ్బపాలెం

అడవిలో ఉన్నట్లు ఉంది



పట్ట పగలు కూడా పిల్లలను బయటకు పంపించలేకపోతున్నాం. గెడ్డ నుంచి మొక్కల కారణంగా అడవిలో ఉన్నట్టు ఉంది. ఏ చెట్టు ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. పగలు కూడా పాములు, తేళ్లు, జెర్రిలు ఇళ్ల ముందుకు వచ్చేస్తున్నాయి.

– ఎం.సావిత్రి, కొత్త దిబ్బపాలెం

ఫిర్యాదు చేసినా..



గెడ్డ విషయంలో పలుమార్లు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశాం. అయినా ఫలితం లేకపోయింది. విషపురుగుల కారణంగా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. గెడ్డను శుభ్రం చేయిస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవు. జీవీఎంసీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– పి.నాగేశ్వరరావు, కొత్త దిబ్బపాలెం

ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుంటాం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఆంధ్రుల ఆత్మగౌరవంపై కేంద్ర ప్రభుత్వానికి చిన్నచూపు తగదని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరంలో 825వ రోజు, బుధవారం స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు, ప్రాణత్యాగాల ద్వారా సిద్ధించిన స్టీల్‌ప్లాంట్‌ను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పాలని ప్రయత్నిస్తే అమ్మేవాడికి, కొనేవాడికి కూడా ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ప్రో కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు సీతానగరంలో దుర్గమాంబ అమ్మవారి పండగను పురస్కరించుకుని ఎస్ఆర్‌వైఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రో కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పండగను పురస్కరించుకుని క్రీడాకారులను ప్రోత్సహించేలా ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కోన తాతారావు, మంత్రి రాజశేఖర్, మొల్లి చిన్న, కురందాస్ వంశీకృష్ణ యాదవ్, నక్క గంగరాజు, గొంప అప్పలరాజు, మొల్లి నూకరాజు, మొల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ధూళిపై పర్యావరణ అధికారుల ఆరా



అగనంపూడి ఏడుమెట్లమర్రిపాలెం మధ్యలో బొగ్గు ధూళిని పరిశీలిస్తున్న చంద్రశేఖర్

అగనంపూడి: పర్యావరణ శాఖ జిల్లా అధికారులు అగనంపూడి, లంకెలపాలెం ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. గంగవరం పోర్టు నుంచి హిందుజా పవర్ ప్లాంట్‌కు రోడ్డు మార్గంలో భారీ వాహనాలతో రవాణా చేస్తున్న బొగ్గు ధూళి వల్ల స్థానికులు పడుతున్న ఇబ్బందులపై వచ్చిన ఫిర్యాదు మేరకు స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. లారీల నుంచి రాలిపడుతున్న బొగ్గు రవ్వల వల్ల వాహనచోదకులు, రోడ్డుపై చేరిన బొగ్గు వల్ల స్థానికులు పడుతున్న ఇబ్బందులపై జిల్లా పర్యావరణ శాఖ అధికారులకు మూడు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో జిల్లా పర్యావరణ విశ్లేషకుడు చంద్రశేఖర్ అగనంపూడిలోని వివిధ దుకాణాల నిర్వాహకులతో మాట్లాడి, కాలుష్యం గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎస్.శ్రీనివాసరావు, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపరచాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు ఉక్కు జనరల్ ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్‌ను కోరారు. ఆస్పత్రిలో సదుపాయాలపై బుధవారం వారు విభాగాధిపతితో చర్చించారు. రోగులను పరీక్షించేందుకు ఏర్పాటు చేసిన స్లాట్ విధానం తీసివేయాలన్నారు. రిఫరల్ ఎంవోయూలను పాత పద్ధతిలో కొనసాగించాలని, ఈఎన్‌టీ, ఐ, ఆప్తమాలజీ, డెంటల్, సర్జికల్ విభాగాల్లో నియామకాలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా వెల్లూరు సీఎంసీకి రిఫరల్ పద్ధతి కొనసాగించేలా చూడాలని కోరగా విభాగాధిపతి సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు నవీన్‌కుమార్, సారంగి, గిరిధర్, క్రాంతికుమార్, కార్మిక నాయకులు మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, గోపాలకృష్ణ, ఆకుల నూకరాజు, బి.టి. జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పంప్ హౌస్‌లో చోరీపై పోలీసుల విచారణ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మిందిలోని మేఘాద్రి గెడ్డ ఫిల్టరేషన్ ప్లాంట్‌లో ఖరీదైన వాల్వ్ హెడ్‌లు, పైపులు చోరీకి గురయ్యాయి. 10 రోజుల క్రితం జరిగిన ఈ చోరీకి సంబంధించి ప్లాంట్ అధికారులు గాజువాక క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ చోరీపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గాజువాక క్రైం ఎస్ఐ మహేశ్వరరావు సిబ్బందితో కలిసి బుధవారం మింది ఫిల్టరేషన్ ప్లాంట్‌కు వెళ్లి వివరాలు సేకరించారు. పలువురు సిబ్బందిని కూడా విచారించారని సమాచారం. ప్లాంట్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సిబ్బంది చేతివాటాన్ని ప్రదర్శించారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. చోరీకి గురైన వస్తువులు సుమారు రూ.2 లక్షలకు పైగా ఖరీదు చేస్తాయని చెబుతున్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: టింపనీ 11కేవీ ఫీడర్, నొవాస్ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 19న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. టింపనీ ఫీడర్ పరిధిలోని ప్రగతి పార్కు ఏరియా, టింపనీ స్కూల్ ఏరియా, ఆదర్శ్‌గ్రౌండ్ ఏరియా, నొవాస్ ఫీడర్ పరిధిలో వుడా కాలనీ ఫేజ్-2, నొవాస్ ఏబీసీ బ్లాక్స్, పోర్టు రోడ్డు ఏరియా, జీవీఎంసీ డంపింగ్ యార్డ్ ఏరియా, భారత్ నగర్, అమరావతినగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ బ్యారెక్స్



నిర్మాణంలో ఉన్న ఆర్పీఎఫ్ బ్యారెక్స్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ సిబ్బంది వసతి, భోజన సౌకర్యం కోసం బ్యారెక్స్‌ను నిర్మిస్తున్నారు. ఆరు మాసాల క్రితం ఆర్పీఎఫ్ కార్యాలయంతో పాటు బ్యారెక్స్ నిర్మాణ పనులు చేపట్టారు. నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం ముఖ ద్వారానికి పక్కన ఆర్పీఎఫ్ కార్యాలయం పనులు పూర్తి చేశారు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం వైపు సిబ్బంది క్వార్టర్స్‌కు సమీపంలో పార్కు స్థలానికి ఆనుకొని బ్యారెక్స్ నిర్మిస్తున్నారు. రెండు పనులు కలిపి కోటి వ్యయంతో నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల తాకిడి రెట్టింపు అవుతుండడంతో పాటు పలు రైళ్లు విశాఖ వెళ్లకుండా దువ్వాడ మీదుగా మళ్లిస్తున్నారు. దీంతో విశాఖ రైల్వేస్టేషన్‌కు వెళ్లని రైళ్లకు దువ్వాడలో హాల్ట్ ఇవ్వడంతో దువ్వాడ ఔట్ పోస్ట్‌లో ఆర్పీఎఫ్ సిబ్బందిని రెట్టింపు చేశారు. సిబ్బంది భోజన వసతి, నివాసానికి వీలుగా వీటిని నిర్మిస్తున్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానంలో పాల్గొన్న యువత, స్థానికులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ కాలనీ లేమర్తిలో హరిణి క్లినిక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ తాతాజీ ఆధ్వర్యంలో అమ్మ బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో 135 మంది పాల్గొని 135 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. డాక్టర్ తాతాజీ మాట్లాడుతూ ఏటా వార్షికోత్సవం సందర్భంగా హరిణి క్లినిక్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హరిణి, స్థానిక నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇది పేదల ప్రభుత్వం



వృద్ధురాలికి పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గత నాలుగేళ్లలో అనేక సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 73వ వార్డు చిననడుపూరులో కార్పొరేటర్ భూపతిరాజు సుజాత ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు చేకూరిన లబ్ధి గురించి వివరించారు. ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పాలన సాగిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, సత్యం, పైడినాయుడు, ప్రసాద్‌రెడ్డి జగన్నాథం, ఆలీ, దాసరి పైడిరాజు, ఆర్.రాంబాబు, పాల అప్పలరెడ్డి, జి.వెంకటరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గౌరీనగర్ జంక్షన్‌లో బస్ హాల్ట్



బస్టాప్ వద్ద కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న దేవన్‌రెడ్డి

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు గౌరీనగర్ జంక్షన్‌లో ఏపీఎస్ఆర్టీసీ బస్ హాల్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ బస్టాప్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఇక్కడ బస్‌స్టాప్ లేక సుమారు ఐదు వేల మంది స్థానికులు నిత్యం ఇబ్బంది పడేవారు. బస్సు ఎక్కాలంటే కూర్మన్నపాలెం వెళ్లాల్సి వచ్చేది. దీంతో గౌరీనగర్ ప్రాంతానికి బస్‌షెల్టర్ అవసరమని, ఆర్టీసీ బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులు ఆర్టీసీ డీఎం దగ్గర నుంచి రీజనల్ మేనేజర్ వరకు వినతులు సమర్పించారు. వారి కృషితో అనుమతులు మంజూరు కావడంతో బుధవారం గౌరీనగర్ బస్టాప్ వద్ద ఆర్టీసీ బస్సుకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం నాయకులు గౌరీనగర్ నుంచి కూర్మన్నపాలెం వరకు ప్రయాణం చేసి, తిరిగి గౌరీనగర్ బస్టాప్ వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం మూర్తి, దువ్వాడ సీఐ శ్రీనివాసరావు, స్టీల్ ఐఎన్‌టీయూసీ సెక్రటరీ మంత్రి రాజశేఖర్, గౌరీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల ఆర్థిక ప్రగతే ప్రభుత్వ లక్ష్యం

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి



నూతన వాహనాలతో మేయర్ హరివెంకటకుమారి, అధికారులు

తాటిచెట్లపాలెం: జోన్-5 పరిధిలోని పారిశుధ్య కార్మికుల కోసం నూతనంగా సమకూర్చిన వాహనాలను బుధవారం తాటిచెట్లపాలెంలోని మినీ సూయేజ్ ఫాం-5లో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ) సహకారంతో నమస్తే స్కీం ద్వారా పారిశుధ్య కార్మికులకు రాయితీపై రెండు పొక్లెయిన్లు, ఒక సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ వాహనాన్ని అందజేసినట్లు చెప్పారు. వాహనాల రాయితీని ఏడేళ్ల పాటు జీవీఎంసీ చెల్లిస్తుందని, దీని ద్వారా పారిశుధ్య కార్మికుడికే లబ్ధి చేకూరుతుందన్నారు. తద్వారా కార్మికులు ఆర్థికంగా బలోపేతమవుతారని మేయర్ తెలిపారు. ఐదుగురు పారిశుధ్య కార్మికులు గ్రూపుగా ఏర్పడి ఒక్కో వాహన నిర్వహణ బాధ్యతను చూసుకుంటారని, ప్రధాన గెడ్డల్లో పూడికలు తీసేందుకు వీటిని వినియోగిస్తామని తెలిపారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ఏఎంవోహెచ్ డాక్టర్ రాజేష్, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, రెడ్డివీధి ప్రాంతంలోని కోదండ రామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఇక్కడి ఆలయం చాలా సంవత్సరాల క్రితం నిర్మించినది కావడంతో ఆ స్థానంలో అన్ని వసతులతో నూతన మందిరాన్ని నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ ఆలయంలో కోదండ రామలింగేశ్వర స్వామితో పాటు లక్ష్మీ గణపతి, అయ్యప్పస్వామి, గాయత్రీదేవి, సుబ్రహ్మణ్య స్వామి, లక్ష్మీప్రసన్న వేంకటేశ్వరస్వామి, సంతోషిమాత, అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా మందిరాలను నిర్మించనున్నారు. కార్యక్రమంలో గాజువాక వైఎస్సార్‌సీపీ నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు, రెడ్డివీధి కుల పెద్దలు, రామిరెడ్డి సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా టెలికాం దినోత్సవం



టెలికాం పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీజీఎం మహంతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో బుధవారం ప్రపంచ టెలీ కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ టెలికాం విభాగం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) బి.కె. మొహంతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన టెలికాం వ్యవస్థను సక్రమంగా నిర్వహిస్తున్న టెలికాం సిబ్బందిని అభినందించారు. సీజీఎం (మెయింటెనెన్స్) పి.కె. సారంగి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉత్పాదకత పెంచడానికి అవసరమైన కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఏడాది టెలికాం దినోత్సవ వేడుకల థీమ్‌ను టెలికాం విభాగాధిపతి కె. శ్రీనివాసరావు వివరించారు. ప్లాంట్ వినియోగిస్తున్న టెలికాం సిస్టమ్స్‌పై ఏజీఎం సునీల్ గౌడ్ పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

అప్పికొండ ఆలయ అభివృద్ధికి వినతి



దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను కోరారు. విజయవాడలో బుధవారం ఆయన్ను కలిసి, ఆలయ ప్రాశస్త్యం గురించి వివరించారు. పురాతనమైన ఆలయంలో మండపం నిర్మించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, శివకుమార్, నజీర్, పెందుర్తి పీఏసీఎస్ డైరెక్టర్ గోవింద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాంబాబు ఉన్నారు.